## క్లుప్తంగా

### ప్రభుత్వ విప్‌కు మద్దతు



చెన్నూర్: ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ చేస్తున్న అభివృద్ధికి తోడుంటామని చెన్నూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పొన్నం మల్లేశంగౌడ్ ఆధ్వర్యంలో విప్‌ను కలిసి న్యాయవాదులు మద్దతు తెలిపారు. ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

### పౌరహక్కుల దినం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

తాండూర్/నెన్నెల: పౌరహక్కుల దినోత్సవాన్ని శనివారం తాండూర్ మండలం కత్తెర్ల గ్రామంలో, నెన్నెల మండలంలోని గొల్లపల్లిలో పౌర హక్కులపై అవగాహన కల్పించారు. కత్తెర్లలో తహసీల్దార్ రోహిత్‌దేశ్ పాండే, ఎంపీడీవో ప్రవీణ్ ముఖ్య అతిథులుగా హాజరై, పౌరహక్కుల ప్రాముఖ్యతను గ్రామీణులకు వివరించారు. గొల్లపల్లిలో డీటీ ప్రకాష్ మాట్లాడుతూ..పౌర హక్కులకు భంగం కలిగించొద్దని పేర్కొన్నారు. పౌరహక్కులు తెలుసుకుంటే ప్రజా సమస్యలు దూరమవుతాయన్నారు. కార్యక్రమాల్లో తాండూర్‌లో సర్పంచ్ శారద, ఎంపీవో సత్యనారాయణ, గిర్దవరి మురళీధర్, నెన్నెలలో వ్యవసాయాధికారి ప్రేంకుమార్, ఆర్ఐ గణేష్, ఎంపీటీసీ బొమ్మెన హరీష్‌గౌడ్, సర్పంచ్ ఇందూరి శశికళ తదితరులు పాల్గొన్నారు.

### కేంద్రీయ విద్యాలయంలో చిరుధాన్యాల మేళా



చిరుధాన్యాల ఆహార పదార్థాల ప్రదర్శన

మంచిర్యాలఅర్బన్: అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకుని పోషణ్‌మహాలో భాగంగా మంచిర్యాల కేంద్రీయ విద్యాలయంలో శనివారం చిరుధ్యానాల మేళా నిర్వహించారు. విద్యార్థులు చిరుధాన్యాలతో తయారు చేసిన వివిధ ఆహార పదార్థాలను ప్రదర్శించారు. సుపోషిత్ భారత్ అనే థీమ్‌ను ప్రచారం, చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ జె.ప్రసాద్ తెలిపారు.

### 'జీవో.142 రద్దు చేయాలి'

పాతమంచిర్యాల: వైద్య ఆరోగ్యశాఖలో రేషనలైజేషన్ పేరుతో అశాస్త్రీయంగా రూపొందించి తీసుకొచ్చిన జీవో నం.142ను రద్దు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే దివాకర్‌రావును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. జీవో రద్దు చేయాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంచిర్యాల శాఖ ఉద్యోగుల జేఏసీ సభ్యులు అల్లాడి శ్రీనివాస్, గుండేటి నాందేవ్, గంధం శంకర్, జి.నాగభూషణం, నారాయణ, నాగభూషణం పాల్గొన్నారు.

### పూలే విగ్రహం ప్రతిష్టించాలి

పాత మంచిర్యాల: జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో మహాత్మాజ్యోతిభాపూలే విగ్రహాన్ని ప్రతిష్టించాలని బీసీ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ సమావేశ మందిరంలో శనివారం మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక కన్వీనర్ ఒడ్డెపల్లి మనోహర్, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, నాయకులు మల్లయ్య, కర్రె లచ్చన్న, సమ్ము రాజన్న, సత్యనారాయణ, విశ్వం, సృజన్, వెంకటసాయి పాల్గొన్నారు.

### విద్యార్థుల స్వచ్ఛతా ర్యాలీ

జన్నారం: గాంధీ జయంతి పురస్కరించుకుని స్వచ్ఛతా ఈ సేవలో భాగంగా మండల కేంద్రంలోని స్లేట్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు శనివారం స్వచ్ఛతా ర్యాలీ తీశారు. ప్రధాన రహదారిపై గల చెత్తను తొలగించారు. పాఠశాల పరిసరాలలో పరిశుభ్రం చేశారు. ప్రతి ఒక్కరూ తమవంతుగా, వారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### చీరలు పంపిణీ

దండేపల్లి: మండలంలోని నంబాల, గుడిరేవు, మేదరిపేట గ్రామాల్లోని మహిళలకు వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ శనివారం చీరలు పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాజయ్య, నాయకులు పాల్గొన్నారు.

# హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి



భీమారంలో తహసీల్దార్ విశ్వంబర్‌కు వినతిపత్రం ఇస్తున్న నగేష్, తదితరులు

బెల్లంపల్లి/భీమారం/కాసిపేట/నెన్నెల/జన్నారం/మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గ్రామాల్లో, పట్టణాల్లో విష జ్వరాలు ప్రబలుతూ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. విషజ్వరాల బారిన పడి వేల రూపాయలు ప్రైవేట్ ఆసుపత్రులకు కట్టబెట్టి నష్టపోతున్నారని మండిపడ్డారు. ప్రాణాలు కోల్పొయిన కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో, పట్టణాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. విష జ్వరాల నియంత్రణ కోసం చర్యలు చేపట్టాలని సూచించారు. బెల్లంపల్లిలో తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్‌కేడీ ప్రసాద్‌కు, భీమారంలో తహసీల్దార్ విశ్వంబర్‌కు, కాసిపేటలో తహసీల్దార్ వేణుగోపాల్‌కు, నెన్నెలలో తహసీల్దార్ ప్రసాద్‌కు, జన్నారంలో తహసీల్దార్ వనజారెడ్డికి, హాజీపూర్ తహసీల్దార్ సతీశ్‌కుమార్‌కు శనివారం సీపీఎం, అనుబంధసంఘాల నాయకులు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమాల్లో బెల్లంపల్లిలో సీపీఎం పార్టీ మండల కార్యదర్శి గోమాస అశోక్, నాయకులు చల్లూరి దేవదాస్, రవి, తిరుపతి, యాకూబ్, శ్రీకాంత్, భీమారంలో నాయకులు రాతిపెల్ల నగేష్, తుమ్మ రేణుక, రమ్య, సమ్మక్క, కిష్టయ్య, కాసిపేట,నెన్నెలలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, నాయకులు సిడాం జంగుబాయి, నాయక్‌పోడ్ సేవాసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొమ్ముల బాపు, జాడి మల్లేష్, దుర్గం రాజబాబు, తిరుపతి, బుచ్చమ్మ, వెంకటి, శంకర్, చల్లూరి దేవాదాస్, జంబి బాపు, జన్నారంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అశోక్, బుచ్చయ్య, లింగన్న, మగ్గిడి జయ, రాజన్న, హాజీపూర్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, అంజి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

కాసిపేట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక సాదాసీదాగా సాగింది. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రి ముఖ్యఅతిథిగా హాజరై నిర్వహించిన సమావేశంలో సామాజిక తనిఖీ బృందం సభ్యులు చదివి వినిపించిన అంశాలపై జరిమానా విధించడం, రికవరీకి ఆదేశించడంతో మండలంలో మొత్తం రూ.21వేల జరిమానా, రూ.10వేల 784 రికవరీకి ఈజీఎస్ సిబ్బందిని అధికారులు ఆదేశించారు. 1జూన్ 2021నుంచి 31మార్చి 2023వరకు నిర్వహించిన 837పనులకు 6కోట్ల 82లక్షల 33వేల 354రూపాయలు ఖర్చు చేయగా ఆ నిధులపై సామాజిక తనిఖీ చేపట్టారు. మద్దిమాడ, దేవాపూర్, గట్రావుపల్లి, పల్లంగూడ, కోనూర్, మామిడిగూడ, మల్కేపల్లి, కొండాపూర్, మామిడిగూడ, పెద్దనపల్లి, కాసిపేట, ముత్యంపల్లి, చిన్నధర్మారం గ్రామపంచాయతీలకు జరిమానాలు, రికవరీలకు ఆదేశించారు. అన్ని గ్రామపంచాయతీల్లో పనుల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండగా, అధికారులు మందలించి వదిలిపెట్టారు.

**సంతకాలు లేకుండానే బిల్లులు..**

చాలా గ్రామపంచాయతీల్లో పనులపై బిల్లులు చెల్లింపుపై అధికారుల సంతకాలు లేవని ఆడిట్ సభ్యులు గుర్తించారు. కూలీల పనిదినాలు, సిబ్బంది ఆన్‌లైన్ చేసి పేమెంట్ చేస్తున్న క్రమంలో సంబంధిత శాఖ హెడ్ ఏపీవో, ఎంపీడీవోల సంతకాలు ఉండాల్సి ఉండగా లేవు. దీంతో అధికారులు, సిబ్బంది మధ్య వాదనలు చోటుచేసుకున్నాయి. మా తప్పు కాదు.. మీది అంటే.. మా తప్పు కాదు.. మీది అని.. ప్రజావేదికలో వాదనలకు దిగడం చర్చనీయాంశంగా మారింది.

**కనిపించని రోజ్‌గార్ దివాస్..**

ఈజీఎస్ కూలీలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రతినెల మొదటి సోమవారం రోజ్‌గార్ దివాస్ పేరున అవగాహన కల్పించాల్సి ఉంది. ఏ గ్రామ పంచాయతీలో నిర్వహించడం లేదని ఆడిట్ సభ్యులు గుర్తించారు. దీంతో అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం ఏ విధంగా ఉందో అర్థం అవుతుంది. కార్యక్రమంలో ఎంపీపీ రోడ్డ లక్ష్మి, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా విజిలెన్స్ అధికారి సురేష్, క్వాలిటీ కంట్రోల్ అధికారి చంద్రశేఖర్, ఎంపీడీవో ఎంఎ అలీం, ఎంపీవో నాగరాజు, ఏపీవో నవీన్, ఎస్ఆర్‌పీ భగవంతరావు, ఎస్‌టీఏం నరేందర్, డీఆర్‌పీలు, వీఎస్ఏలు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



సమ్మెకు మద్దతు తెలుపుతున్న నాయకులు

లక్సెట్టిపేట/నెన్నెల/వేమనపల్లి: మధ్యాహ్న భోజన కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం నెన్నెల ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. లక్సెట్టిపేటలో తహసీల్దార్ రాఘవేంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. వేమనపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు టీఏజీఎస్ జిల్లా అధ్యక్షుడు బాగాల రాజన్న, కార్యదర్శి ఎర్మ పున్నం సంఘీభావం తెలిపారు.

### 'కార్యాలయంపై దాడి హేయమైన చర్య'

చెన్నూర్: ప్రభుత్వ ప్రోత్సాహంతో ఎంఐఎం గుండాలు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కార్యాలయంపై రాళ్లతో దాడి చేశారని, కార్యాలయం పై దాడి చేయడం హేయమైన చర్య అని బీజేపీ పెద్దపల్లి జిల్లా కో కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఐఎం నాయకులు బీజేపీ నాయకులపై దాడి చేస్తే ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం దాడులు చేసిన వారిని గుర్తుపట్టి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు సుశీల్‌కుమార్, చింతల శ్రీనివాస్, కొరకొప్పుల వంశీగౌడ్ పాల్గొన్నారు.

## దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

పాతమంచిర్యాల: దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని హీల్ స్వచ్ఛంద సంస్థ, బీసీ రాజ్యాధికార సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో శనివారం దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఒక్క రోజు నిరసన దీక్ష చేపట్టారు. ప్రతి వారం సదరం క్యాంపు, వైద్య పరీక్షలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు అందించాలన్నారు. స్లాట్ బుకింగ్ పేరిట దివ్యాంగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, స్లాట్ బుకింగ్ లేకుండానే సదరం శిబిరాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి చుంచు రాజ్‌కిరణ్, వైద్యులు రమణ, మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్, బీసీ నాయకులు శ్రీనివాస్, లచ్చన్న, మధుసూధన్ శ్రీనివాస్, రాజేశం, భాస్కర్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# 'కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటాం'

చెన్నూర్/జైపూర్/మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం ఇచ్చిన హామీని నెరవేర్చకుండా ఆదివారం పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ మందమర్రి పర్యటనకు వస్తున్నారని, పర్యటనను అడ్డుకుంటామని కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, అంబేద్కర్ సేనా తదితర పార్టీల నాయకులు హెచ్చరించారు. మందమర్రిలో గతంలో అప్పటి దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి తోళ్ల పరిశ్రమను ప్రారంభించారని తెలిపారు. తోళ్ల పరిశ్రమ మూతపడడంతో దళిత యువకులు ఉపాధి కోల్పోయారని పేర్కొన్నారు. తోళ్ల పరిశ్రమను తెరిపిస్తానని పలుమార్లు ప్రభుత్వ విప్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గతంలో ఇచ్చిన హామీలు ఇవ్వకుండా పర్యటించడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. మాట నిలబెట్టుకోకుండా జిల్లాలో పర్యటించే అర్హతలేదన్నారు. చెన్నూర్ రెవెన్యూ డివిజన్ కళగానే మిగిలిందని, శ్రావణపల్లి బొగ్గు గనులు ప్రారంభం కాలేదన్నారు. అనేక హామీలు ఇచ్చిన ప్రభుత్వం మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో చెన్నూర్‌లో పీసీసీ సభ్యులు నూకల రమేష్, కాంగ్రెస్ నాయకులు చెన్న సూర్యనారాయణ, చీర్ల సుధాకర్‌రెడ్డి, ఖలీల్, రమేష్ పాల్గొన్నారు. జైపూర్‌లో వైఎస్సార్ తెలంగాణ పార్టీ మండల అధ్యక్షుడు తుంగపిండి సాయికుమార్, మందమర్రిలో వేరువేరుగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్, టీపీసీసీ డాక్టర్ సెల్ వైస్ చైర్మన్ దాసారపు శ్రీనివాస్, బీఎస్పీ చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు తుంగపిండి రమేష్, వైఎస్సార్‌టీపీ జిల్లా యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అజీమోద్దీన్, అంబేద్కర్ సేనా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుంగపిండి రాజేశ్‌కుమార్, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## 'మందమర్రి ఏరియాలో 91శాతం బొగ్గు ఉత్పత్తి'



వివరాలు వెల్లడిస్తున్న జీఎం మనోహర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో సెప్టెంబర్ నెలలో 91శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామని ఏరియా జీఎం మనోహర్ పేర్కొన్నారు. ఏరియా జీఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. కేకే-5 గనిలో 13వేల 369టన్నులు, కాసిపేట గనిలో 11వేల 351టన్నులు, కాసిపేట-2 గనిలో 8వేల 228టన్నులు, శాంతిఖనిలో 4వేల 956టన్నులు, ఆర్కే-ఓసీపీ గనిలో 1లక్ష 36వేల 213టన్నులు, కేకే-ఓసీపీ గనిలో 1లక్ష 23వేల 003 టన్నుల ఉత్పత్తి సాధించామని తెలిపారు. ఆర్కే ఓసీపీలో లక్ష్యాన్ని మించి 136శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామన్నారు. భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తి శాతం తగ్గుతుందని, ఏరియాలో సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యానికి ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, అధికారులు సమష్టి కృషి చేసి సహకరించాలని కోరారు. సమావేశంలో ఏరియా పీఎం శ్యాంసుందర్, ఐఈడీ రాజన్న, డిప్యూటీ సీఎంవో ఉషరాణి పాల్గొన్నారు.

**శ్రీరాంపూర్‌లో 89శాతం ఉత్పత్తి**

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో సెప్టెంబర్ నెలలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యంలో 89శాతం ఉత్పత్తిని సాధించినట్లు ఏరియా ఇన్‌చార్జి జీఎం రఘుకుమార్ తెలిపారు. జీఎం కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. సెప్టెంబర్‌లో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం 445500 టన్నులకు గాను 396722 టన్నులు సాధించినట్లు తెలిపారు. దీంతో పాటు ఏరియాకు ఏప్రిల్ 1నుంచి ఇప్పటి వరకు నిర్దేశించిన ఉత్పత్తి 3091000 టన్నులకు గాను 2540760 టన్నులు సాధించామన్నారు. ఈ లెక్కన 82శాతం ఇప్పటి నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. కంపెనీ వ్యాప్తంగా అన్ని ఏరియాలకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యంలో కూడా కంపెనీ సెప్టెంబర్ నెలలో 65శాతం సాధించిందన్నారు. వర్షాల వల్ల ఓసీపీల్లో అనుకున్న ఉత్పత్తిని సాధించలేకపోయామని తెలిపారు.

### 'నిరసనలు తెలుపాలి'

రామకృష్ణాపూర్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేనందునా మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా నిరసనలు తెలుపాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం శనివారం పిలుపునిచ్చారు. రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు గడుస్తున్నా సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే బాల్కసుమన్ సైతం కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఎన్నడూ స్పందించలేదన్నారు. నాయకులు శ్రీనివాస్, యాదగిరి, సదానందం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

**బొగ్గుబాయి వార్తలు**

### రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై వినతి

శ్రీరాంపూర్: సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోల్‌మైన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం అసోసియేషన్ నాయకులు కేఆర్సీ రెడ్డి, ఎం.బాబురావు, ఏనుగు రవీందర్ రెడ్డి అలవందరు వేణుమాధవ్, పీటీ స్వామీలు హైదరాబాదులో సీఎం ముఖ్య కార్యదర్శి ఎస్ నరసింగ్‌రావును కలిసి వినతిపత్రం సమర్పించారు.

### రిటైర్డ్ ఉద్యోగులకు వీడ్కోలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని పలు గనులు, డిపార్టుమెంట్‌లలో సర్వీస్ పూర్తి చేసి, రిటైర్డ్ అయిన ఉద్యోగులను యాజమాన్యం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికింది. జీఎం కార్యాలయంలో ఆఫీస్ అటెండెంట్‌గా పనిచేసిన సమ్మయ్య శనివారం పదవీ విరమణ పొందగా, ఆయన్ను ఇన్‌చార్జి జీఎం రఘుకుమార్ శాలువాతో సన్మానించి ఆయన కంపెనీలో చేసిన సేవలను కొనియాడారు. ఆర్కే 5బి, ఆర్కే న్యూటెక్, ఎస్సార్పీ 3, 3ఏ గనిలో రిటైర్డ్ అయిన ఉద్యోగులను సన్మానించి, వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అరవిందరావు, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు సురేందర్ రెడ్డి, ఏఐటీయూసీ డెప్యూటీ జనరల్ సెక్రెటరీ భాజీ సైదా, హెచ్ఎంఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సాదాసీదాగా మున్సిపల్ సమావేశం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజయ్య

మంచిర్యాలక్రైం: స్థానిక మున్సిపల్ సర్వసభ్య సమావేశం మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య అధ్యక్షతన శనివారం సాదాసీదాగ సాగింది. మున్సిపల్ కౌన్సిలర్స్ సమక్షంలో మున్సిపాలిటీలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా 19ఎజెండా అంశాలకు ఏకగ్రీవంగా ఆమోదించారు. స్థానిక ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహాన్ని 12ఫీట్ల ఎత్తుతో ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.35లక్షలతో నిర్మాణం పనులకు తీర్మానం చేశారు. రాజీవ్‌నగర్‌లో విద్యుత్ స్ట్రీట్‌లైట్స్ పనులకు, పట్టణంలోని పలు వార్డుల్లో పట్టణ ప్రగతినిధులతో రూ.25,50లక్షలతో పనులకు తీర్మానం చేశారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న 16మంది ఎస్ఎంఆర్‌లకు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పెంచిన డీఏ జనవరి 2022నుంచి 2023వరకు ఏరియర్స్ బిల్ చెల్లించుటకు కౌన్సిల్ తీర్మానం చేసింది. 2023-24 సంవత్సరానికి సిస్టం మేనేజర్, సిస్టం అసిస్టెంట్‌లకు వేతనాలు చెల్లించుటకు వ్యయం రూ.7,28,04మున్సిపాలిటీ సాధారణ నిధుల నుంచి చెల్లించుటకు ఆమోదించారు.మరికొన్ని ముఖ్యమైన అంశాలను ప్రస్తావిస్తూ, మున్సిల్ కౌన్సిల్ సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, కోఆప్షన్ సభ్యులు, మేనేజర్ విజయ్‌కుమార్, మున్సిపల్ ఇంజనీర్ మధూకర్, రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శ్వేత

బెల్లంపల్లి: దసరా, బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు మున్సిపల్ ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు చేస్తామని బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అన్నారు. బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో శనివారం చైర్‌పర్సన్ శ్వేత అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దసరా ఉత్సవాల కోసం బెల్లంపల్లి పట్టణంలోని పోచమ్మ చెరువు, జాతికుంట చెరువు, గొంతెమ్మ గుట్ట చెరువు వద్ద జనరేటర్, లైటింగ్ ఏర్పాటు కోసం కౌన్సిల్ సభ్యులు తీర్మానం చేసి ఆమోదం తెలిపినట్లు శ్వేత తెలిపారు. దీంతో పాటు బజారుప్రాంతంలో సెంట్రల్ లైటింగ్, 34వార్డుల్లో లైటింగ్ ఏర్పాటు కోసం ఆమోదం జరిగిందని సూచించారు. దీంతో పట్టణంలో చేపట్టనున్న అభివృద్ధి పనుల గురించి చర్చించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఎంపీ వెంకటేశ్‌నేత

పాతమంచిర్యాల: మంచిర్యాల పట్టణానికి శోభ తీసుకొచ్చేలా రోడ్లు, సెంట్రల్‌లైటింగ్ సిస్టం ఏర్పాట్లు చేస్తూ, పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఎంపీ బోర్లకుంట వెంకటేశ్‌నేత అన్నారు. జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. లక్ష్మీటాకీస్ నుంచి వైశ్యభవన్ వరకు రూ.15కోట్లతో ఏర్పాటు చేసిన రోడ్డు, సెంట్రల్‌లైటింగ్ సిస్టంను ఆయన ప్రారంభించారు. ట్రాఫిక్ సమస్యలు దృష్టిలో ఉంచుకొని, ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించి అవసరమైన చోట కల్వర్టులు, బ్రిడ్జిల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ వసుందర, 10వార్డు కౌన్సిలర్ ఆసంపల్లి లావణ్య, బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# పొర్లుదండాలతో అంగన్‌వాడీల నిరసన



దండేపల్లి: అంగన్‌వాడీల పొర్లు దండాలు

దండేపల్లి: సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెలో భాగంగా దండేపల్లిలో శనివారం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, రోడ్డుపై పొర్లు దండాలు చేసి, వినూత్న నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మెను విరమించమని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

భీమిని/కాసిపేట: సమస్యలు పరిష్కరించాలని కాసిపేటలో అంగన్‌వాడీలు శనివారం మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. భీమిని, కన్నెపల్లి మండలాల్లో సైతం సమ్మె కొనసాగింది. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని, అప్పటి వరకు ఆందోళనలు కొనసాగించనున్నట్లు తెలిపారు.

## సంక్షిప్త వార్తలు

**1న ఫిల్మ్ అప్రియేషన్ వర్క్‌షాప్**

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ భాష, సంస్కృతి విభాగం సహకారంతో పాత మంచిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 1న ఫిల్మ్ అప్రిసియేషన్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకుడు చంద్రమౌళి తెలిపారు. లెజెండరీ యాక్టర్, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత పైడి జైరాజ్ 114సంవత్సరాల వేడుకల నేపథ్యంలో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

**'కేటీఆర్ యాదవుల సమస్యలపై మాట్లాడాలి'**

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా వ్యాప్తంగా యాదవులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా పర్యటనలో భాగంగా మందమర్రికి వస్తున్న మంత్రి కేటీఆర్ తప్పకుండా మాట్లాడాలని యాదవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గద్దం సతీశ్‌యాదవ్, జిల్లా అధ్యక్షురాలు పుట్ట లావణ్య శనివారం ఒక ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు.

**'సొంతింటి కల హామీపై స్పందించాలి'**

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్, మందమర్రి ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న మంత్రి కేటీఆర్ సింగరేణి కార్మికుల సొంతింటి కల హామీపై స్పందించాలని సీఐటీయూ బ్రాంచి అధ్యక్షుడు ఎస్.వెంకటస్వామి శనివారం డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులకు సొంతింటి పథకాన్ని అమలుచేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారని, ఇప్పటివరకు దానిని అమలు చేయలేదన్నారు. నాయకులు రాజేందర్, ఐలయ్య, సంజీవ్, వెంకటేష్ పాల్గొన్నారు.

**'మేరీ మాటీ.. మేరా దేశ్'**

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లి గ్రామపంచాయతీ న్యూ కాలనీలో శనివారం కేంద్రప్రభుత్వం తపాలశాఖ ఆధ్వర్యంలో అమరవీరుల త్యాగాలకు 'మేరీమాటీ-మేరాదేశ్'కార్యక్రమం నిర్వహించారు.

జైపూర్: మండలంలోని ఇందారం, టేకుమట్ల, కుందారం, కిష్టాపూర్, వేలాల గ్రామాల్లో 'మేరీ మిట్టీ-మేరీ దేశ్' కార్యక్రమంలో భాగంగా శనివారం మట్టిని సేకరించారు. గ్రామాల్లో పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

**ఆశ కార్యకర్తల డిమాండ్లు నెరవేర్చాలి**

కోటపల్లి: పెరుగుతున్న ధరలను అనుగుణంగా వేతనాలు పెంచి ఆశా కార్యకర్తలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విజయ, శ్రీదేవి, భాగ్య, రాజేశ్వరి పాల్గొన్నారు.

**ఆశల సమ్మెకు బీజేపీ మద్దతు**

నెన్నెల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న ఆశ కార్యకర్తలకు శనివారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మెన హరీష్‌గౌడ్ మద్దతు తెలిపి సమ్మెలో పాల్గొన్నారు. ఆశల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**కుల నిర్మూలనకు ఐక్యంగా పోరాడాలి**

మంచిర్యాలఅర్బన్: దేశంలో కుల నిర్మూలన కోసం అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా పోరాడాలని పీవైఎల్ నాయకుడు మనోహర్ పిలుపునిచ్చారు. మంచిర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం సత్యశోధక్ సమాజ్ వారోత్సవాల సందర్భంగా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులురాహుల్, తిరుపతి, సిద్దార్థ, శిరీష, అంజలి, రక్షిత పాల్గొన్నారు.

**'మత విద్వేషాలకు వ్యతిరేకంగా పోరాడుదాం'**

జన్నారం: దేశంలో కులవివక్ష, మత వ్యతిరేకంగా పోరాడుదామని సీపీఐఎంల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ అన్నారు. జన్నారం మండలం చింతగూడలో శనివారం కుల వివక్ష, మత విద్వేషాలపై గ్రామంలో అవగాహన కల్పించారు.

**బొట్టుపెట్టి.. ఆహ్వానించి**

భీమారం: మంత్రి కేటీఆర్ సభకు రావాలని శనివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు మండల కేంద్రంలో ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి ఆహ్వానించారు. నాయకులు వడ్లకొండ పవన్, తగరం మొండి పాల్గొన్నారు.